క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



వెదురుమూడిలో షిర్డి సాయిని దర్శించుకుంటున్న భక్తులు

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో నూతనంగా నిర్మించిన షిర్డి సాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలను భక్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పండితులు తమ వేద మంత్రోచ్ఛరణలతో బాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో గ్రామంతో పాటు అంగర, నల్లూరు, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అన్న ప్రసాదాలని స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నేడు వ్యవసాయ పరికరాల పంపిణీ

కపిలేశ్వరపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంజూరైన యంత్ర పరికరాలను సోమవారం కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో అందజేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 17 మందికి పవర్ టిల్లర్లు మంజూరయ్యాయన్నారు. వాటిని లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతులు మీదుగా పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

విద్యుత్ కోతలతో అవస్థలు



ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి

కపిలేశ్వరపురం: టేకి గ్రామస్తులు విద్యుత్ కోతలతో తీవ్రమైన అవస్థలు పడుతున్నారని గ్రామ ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఎనిమిది గంటలు నుంచి సాయంత్రం నాలుగు గంటలు వరకూ నిలిపివేశారని, ఎండ వేడి, ఉక్కపోతలతో చిన్నారులు, వృద్ధులు తీవ్రమైన అవస్థలకు గురయ్యారన్నారు. సంబంధిత అధికారులు విద్యుత్ సరఫరాను వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మెరుగుపర్చాలని ఎంపీటీసీ వీరవేణి డిమాండ్ చేశారు.


పాఠశాలలో టీవీ చోరీ



స్మార్ట్ టీవీ చోరీ జరిగిన పాఠశాల

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి సచివాలయ సమీపంలోని ఎంపీ ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీ చోరీకి గురైంది. వెసవి సెలవులు పూర్తయ్యి పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణకు సంబంధించిన బియ్యం లోడును దిగుమతి చేయించుకునేందుకు ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుడ్ల వెంకటేశ్వరరావు పాఠశాలకు వెళ్లారు. తాళం పగలగొట్టి సుమారు రూ.70వేలు విలువైన టీవీని చోరీ చేసినట్టు ఆయన గమనించారు. దీనిపై మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో పాఠశాల హెచ్‌ఎం ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



చెల్లూరులో సీసీ, డ్రైన్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

రాయవరం: మండలంలోని చెల్లూరులో ఎస్ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం భూమిపూజ చేశారు. చెల్లూరు, చెల్లూరు శివారు కృష్ణమ్మచెరువు, యర్రమట్టిపురంలో రూ.70 లక్షల నిధులతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. నాణ్యతతో నిర్మించాలని సదరు వ్యక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు నూనె ఏసుబాబు, చంద్రు వీర్రాజు, మోరంపూడి రాజ్‌కుమార్, దేవు శ్రీను, వైఆర్‌కే పరమహంస, వుండవిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: ముక్కామల ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం నుంచి ముక్కామల వైపు వస్తున్న ఆటోను ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీ కొన్నాయి. దాంతో మోటారు సైకిలిస్టుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అంబాజీపేట పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.

నిఘా కన్ను పని చేస్తుందా..?

- షాపుల వద్ద పూర్తి కాని సీసీ కెమెరాలు
- అర్ధరాత్రి వేళ ఆకతాయిల అల్లర్లు
- పోలీసుల కన్నుగప్పుతున్న వైనం



పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

రామచంద్రపురం: పట్టణంలో అర్ధరాత్రి దాటితే ఆకతాయిల అల్లర్లు అధికమవుతున్నాయి. ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు ఇష్టారాజ్యంగా మారుతున్నాయి. వీటన్నింటిని అరికట్టేందుకు పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలు అసలు పని చేస్తున్నాయో లేదా...? వాటిని ఆ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తం కాక తప్పటం లేదు.

పూర్తి స్థాయిలో ఏర్పాటు కాని కెమెరాలు

ప్రధాన రహదారిలో మూడు ప్రధాన కూడళ్లలో మాత్రమే పోలీస్ శాఖ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది రాజగోపాల్ సెంటర్‌లో మండపేట వైపునకు ఒకటి, కాకినాడ రోడ్డులో మామూలు కెమెరా ఒకటి, 360 డిగ్రీల కెమెరా మరొకటి, శివాలయం వీధిలో 360 డిగ్రీల కెమెరా, మార్కెట్ సెంటర్‌లో 90 డిగ్రీల ఒకటి, 360 డిగ్రీల కెమెరా మరొకటి ఏర్పాటు చేశారు. కానీ ఇవి అసలు పని చేస్తున్నాయో లేదోననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా పట్టణంలో వ్యాపారల కూడళ్ల వద్ద, షాపుల వద్ద ఆసుపత్రులు, సూపర్ బజార్లలోను, సినిమా హాళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గతంలో పోలీస్ శాఖ అధికారులు సమావేశాలు పెట్టి మరీ చెప్పారు. కానీ పట్టణంలో సుమారుగా 30 శాతం మాత్రమే ఇవి ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ప్రధాన రహదారిలో చాలా షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు కాలేదు. ప్రధాన వాణిజ్య కేంద్రాల వద్ద కూడా సీసీ కెమెరాలు లేవు. ప్రధానమైన ఆఫీసుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు కాలేదు.

పోలీసులకు సవాళ్లు

గత కొన్నాళ్లుగా రామచంద్రపురం శివారు ప్రాంతాలతో పాటుగా పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆకతాయిల అల్లర్లు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి 11 గంటలు దాటిన తరువాత మందుబాటిళ్లతోను, బీరు బాటిళ్లతోను మోటారు సైకిళ్ల మీద తిరుగుతూ హల్‌చల్ చేస్తుంటే ఎదురుగా వెళుతున్న వాహనదారులను ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో పట్టణంలోని శివాలయం వీధిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నంది విగ్రహం చోరీకి గురైన సంఘటనలో అప్పట్లో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఆ దృశ్యాలు ఎక్కడా కానరాలేదు. దానికి ప్రధాన కారణం దొంగలు వేరే దారిన వెళ్లిపోవడమేనని అనుకున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల్లో బైక్ చోరీలు అధికంగా జరుగుతున్నాయి. సీసీ కెమెరాలను దాటుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్న వైనంతో అసలు చోరీ అయిన బైక్‌లు ట్రేస్ కాలేదంటే మన సీసీ కెమెరాలు ఏ విధంగా పనిచేస్తున్నాయోననే అనుమానాలను పట్టణ వాసులు వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని ఏర్పాటు చేయాలి

పట్టణంలోని ప్రధాన రహదారిలో మూడు చోట్ల మాత్రమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ బ్యాంకు సెంటర్ ఎల్ఐసీ భవనం, ఆర్డీవో కార్యాలయంతో పాటుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెల్ల వంతెన వంటి ప్రాంతాలతో పాటుగా రామచంద్రపురం పరిసర ప్రాంతాలు దాటి వెళ్లే కూడళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలో ఆకతాయిలు, చోరులు సీసీ కెమెరాలు లేని ప్రాంతాల నుంచి పట్టణం దాటి వెళ్లిపోతున్నారు. వీటిని అరికట్టేందుకు పట్టణం నుంచి బయటకు వెళ్లే మార్గాల్లోను సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పట్టణ వాసులు చెబుతున్నారు. వీటితో పాటుగా ప్రధాన రహదారిలోని ప్రతి షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని అర్ధరాత్రి వేళల్లో పట్టణంలో జరుగుతున్న అల్లరి మూకల ఆట కట్టించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సోమేశ్వరుని సన్నిధిలో మద్రాస్ హైకోర్టు జడ్జి



సోమేశ్వరుని దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు జడ్జి మాలా తదితరులు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువైన చాయా సోమేశ్వరస్వామిని మద్రాస్ హైకోర్టు జడ్జి ఎస్.మాలా కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్న ఆలయ ఈవో జె.భీమశంకర్‌రావు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: మద్రాస్ హైకోర్టు జడ్జి ఎస్.మాల దంపతులు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జడ్జి దంపతులు భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం అడిషనల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.నాగేశ్వరరావు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు వైఎస్సార్ సీపీతోనే గుర్తింపు



వరప్రసాద్, గుబ్బల శ్రీనులను అభినందిస్తున్న జై భీమ్ దళిత సేవా సంఘం సభ్యులు

రామచంద్రపురం రూరల్: దళితులకు వైఎస్సార్ సీపీతోనే గుర్తింపు దక్కుతుందని దళిత నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీ రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా నియమితుడైన పోలినాటి వరప్రసాద్, అదేవిధంగా రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితుడైన గుబ్బల శ్రీనివాస్‌లను ఆదివారం జై భీమ్ దళిత సేవా సంఘం సభ్యులు కలిసి అభినందించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే తరువాత అంతటి గుర్తింపు ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. ప్రస్తుతం రామచంద్రపురం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు పోలినాటి వరప్రసాద్‌ను ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



దుగ్గుదుర్రులో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: భారతదేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, ఆయన ఆశయాలు యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రులో ఆదివారం సీఎస్సార్ నిధులు రూ.20 లక్షలు, ప్రజా విరాళంతో నిర్మించిన అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించి, కమ్యూనిటీ హాలు ఆవరణలో ప్రజా విరాళంతో నిర్మించిన అంబేడ్కర్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో కుల, ఆర్థిక అసమానతలు తొలగిపోయి అన్ని వర్గాల వారు సమానత్వంతో మసలుకునేలా అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కమిటీ సభ్యుల కోరిక మేరకు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు చుట్టూ ప్రహరి నిర్మించేందుకు అవసరమైన మరో రూ.ఐదు లక్షల నిధులు మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ, గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి, జ్యోతికుమార్, స్థానిక నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, గ్రామ పెద్దలు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో రెండు కిడ్నీలు పాడైన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాకినాడకి చెందిన సంకు సురేష్‌కి రెండు కిడ్నీలు పాడయిపోయాయి. డయాలసిస్ చేయించుకుంటున్నారు. కిడ్నీ మార్చుకోవాలని డాక్టర్లు చెప్పారు. ఆర్థికంగా అంతస్తోమత లేని వారు కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో రావులపాలెంలో సురేష్ భార్య దివ్యకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.11 వేల చెక్కు సాయంగా అందజేశారు.

ఆకట్టుకుంటున్న పోశమ్మ చెరువు



చెరువు మధ్యలో పద్మంలో నిర్మించిన నాభిశిలలు



పార్కును తలపిస్తున్న చెరువులోని వంతెన

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామ దేవత పోసమ్మ ఆలయ చెరువును ఆధ్యాత్మిక, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. గ్రామం ఏర్పడిన నాటి నుంచి గ్రామదేవతగా అమ్మవారిని విశేషంగా కొలుస్తారు. ఆ నాటి రోజుల్లో గ్రామ ప్రజలకు పోసమ్మ చెరువునీళ్లే తాగునీరు. అంతటి ప్రాశస్త్యం గల పోసమ్మ చెరువును ఒక ఆధ్యాత్మిక, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు గ్రామానికి చెందిన యువకులు పరితపించారు. అంగర గ్రామం శిల్పకళాకారులకు పెట్టింది పేరు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన శిల్పకళాకారులు పోసమ్మ చెరువును కళాత్మకంగా తీర్చిదిద్దేందుకు సన్నద్ధమయ్యారు. శిల్పకళాకారులు శ్రమదానంతో పార్కును తలచే రీతిలో తీర్చిదిద్దారు. 1940ల నాటి చెరువు మధ్యలోని కొయ్య ప్రతిమల స్థానంలో శ్రీలక్ష్మీనారాయణ స్వరూపాలైన నాభిశిలలను ప్రతిష్ఠించారు. ఈ నెల 5న ప్రతిష్ఠ పూజల్లో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఉత్సవంలా పాల్గొన్నారు. చెరువు మధ్యలో పద్మం ఆకారంలో ప్రత్యేక నిర్మాణాన్ని చేపట్టారు. అందులో ఏర్పాటు చేసిన నాభిశిలలను దర్శించుకునేందుకు చెరువు గట్టు నుంచి వంతెనను నిర్మించారు. వంతెన సింహద్వారాన్ని ఏనుగు ఆకారంలో తీర్చిదిద్దగా విశేషంగా ఆకట్టుకుంది. సింహద్వారం నుంచి నాభి శిలలకు వెళ్లే దారి వెంబడి పలువురు దేవతామూర్తుల విగ్రహాలను నిర్మించారు. ఒకప్పుడు పోసమ్మ చెరువు అంటే మంచి నీటి చెరువుగానూ, రచ్చబండగానూ చెప్పుకునేవారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల శిల్పకళాకారుల శ్రమదానంతో ఇప్పుడు చెరువు ఒక పార్కును తలపిస్తుంది. కళాకారుల కృషిని పడమర ఖండ్రిక గ్రామస్తులు అభినందిస్తున్నారు.

జిల్లా స్థాయి యోగాభ్యసన విజయవంతం చేయాలి



ద్రాక్షారామలో యోగా కార్యక్రమ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆర్డీవో అఖిల, ఇతర అధికారులు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన ద్రాక్షారామలో నేటి ఉదయం 6 గంటలకు భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి యోగా అభ్యసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆమె రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఇతర అధికారులతో కలసి భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆమె సోమవారం ఉదయం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మెరిసిన యువతులు



నురుకుర్తి వైష్ణవి



బిక్కిన సృజన

రాయవరం: పేదలకు వైద్య సేవలు అందించాలని ఉందని నురుకుర్తి వైష్ణవి తెలిపారు. ఏపీ ఈఏపీ సెట్‌లో వైష్ణవి 150వ ర్యాంకు సాధించింది. ఇంటర్‌లో 990 మార్కులు సాధించానని, నీట్‌లో మంచి ర్యాంకు సాధిస్తాననే నమ్మకం ఉందని, షైనింగ్ స్టార్ అవార్డును కూడా తాను సాధించినట్లు విద్యార్థిని పేర్కొంది.

కంప్యూటర్ ఇంజనీర్‌గా రాణించాలనుంది: మండలంలోని పసలపూడికి చెందిన బిక్కిన సృజన ఏపీ ఈఏపీ సెట్‌లో 194వ ర్యాంకును సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో 1,190, అడ్వాన్స్‌డ్‌లో 1,384వ ర్యాంకును సాధించినట్లు ఆమె తెలిపారు. ఇంటర్‌లో 972 మార్కులు సాధించినట్లు వెల్లడించింది. ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ బ్రాంచ్ చదవాలన్నది తన లక్ష్యమని, భవిష్యత్తులో కంప్యూటర్ ఇంజనీర్‌గా స్థిరపడాలని ఆమె వెల్లడించింది.


శ్రీకృష్ణునికి వైభవంగా ప్రత్యేక పూజలు



నల్లచెరువులో శ్రీకృష్ణునికి పూజలు నిర్వహిస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణభగవానుకి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో కృష్ణభగవానునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ప్రభూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఐదు గంటలకు హరినామ సంకీర్తనలు చేశారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. స్వామివారి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

అనారోగ్య బాధితుడికి సాయం



లక్ష్మీనారాయణకు సాయం అందిస్తున్న గ్రూపు సభ్యులు

మలికిపురం: రాజోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వీరవల్లి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఉండడంతో చికిత్స నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి గ్రూప్ సభ్యులు సమకూర్చిన రూ.20 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మామిడిశెట్టి సూర్యనారాయణ, మామిడిశెట్టి మధుసూదనరావు, కుక్కల శ్రీరామ్మూర్తి , కుడుపూడి సత్యనారాయణ, పితాని శ్రీనివాస్, కడలి శ్రీను, మామిడిశెట్టి నగేష్, గెద్దాడ శ్రీను తదితరులు పాల్గొని దాతలను అభినందించారు. గ్రూప్ సభ్యులు కడలి కృష్ణార్జునుడు, దొంగ సత్తిబాబు, గుబ్బల గోవర్ధన పద్మకుమారి, కాండ్రేగుల నాగరాజు, దొమ్మేటి రమేష్, చెల్లుబోయిన సూర్య చంద్రప్రకాష్, కాండ్రేగుల లక్ష్మీ నరసింహమూర్తి, కట్టా వాసు పాల్గొన్నారు.

66 బీరు సీసాల స్వాధీనం

ఐ.పోలవరం: పుదిచ్చేరి యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టుగా ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. యానాం నుంచి ఎదుర్లంక మీదుగా కారులో 66 బీరు సీసాలను తరలిస్తున్నారు. ఎదుర్లంక వద్ద ఉన్న చెక్‌పోస్టు వద్ద తనిఖీలో బీరు సీసాలు దొరికాయి. కారుతోపాటు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

భానుడి భగభగలు

- ప్రతాపం చూపిన రోహిణీ కార్తె
- పెరుగుతున్న ఎండలు
- వేసవి తాపానికి అల్లాడిన ప్రజలు
- మృగశిరపై భయాందోళనలు



గొల్లపాలెంలో ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారిన కాకినాడ-కోటిపల్లి రోడ్డు



ఆర్యావటంలో మధ్యాహ్నం ఎండవేడికి తాళలేక చెట్టుకింద కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న ఐస్‌క్రీం వ్యాపారి

కాజులూరు: ప్రచండ భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకీ సూర్యభగవానుడు నిప్పులు చెరుగుతుండటంతో వేసవి తాపానికి తట్టుకోలేక గ్రామాల్లోని ప్రజలు విలవిల్లాడుతున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గత 10 రోజులుగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో ఎండకు జడిసి వృద్ధులు, పిల్లలు, మహిళలు బేజారెత్తుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గ గ్రామాల్లో గత వారం రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రత 26 డిగ్రీలుగా నమోదవుతుండగా అత్యధిక ఉష్ణోగత 37 నుంచి 39 డిగ్రీలుగా నమోదవుతూ వచ్చింది. మే 25న ప్రారంభమైన రోహిణీ కార్తె ఆదివారంతో ముగిసింది. ఆపై మృగశిర కార్తె ప్రారంభమై ఈ నెల 22వ తేదీ వరకూ కొనసాగుతుంది. 'రోహిణీ కార్తెలో రోళ్లు బద్ధలవుతాయని, మృగశిరలో బోషాణాలు పగుళ్లు తీస్తాయని' నానుడి. రోహిణీ కార్తె ప్రారంభంలో ఉపరితల ఆవర్తనద్రోణి ప్రభావంతో నాలుగు రోజులు వాతావరణం చల్లగానే గడిచింది. ఆపై రోజు, రోజుకు ఎండలు ముదురుతూ వచ్చాయి. ×రోహిణీకార్తెలో రోళ్లు బద్ధలవుతాయన్న నానుడికి అనుగుణంగానే గత 10 రోజులు ఎండలు విపరీతం కాయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మృగశిరకార్తెలో ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నైరుతి రుతుపవనాల రాకకోసం ప్రజలు ఆకాశం వంక ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎండతీవ్రత సమయంలో బయట తిరగవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలకు కూడా ఎండ తీవ్రత తగ్గడం లేదని ఎండవేడిమి భరించలేకపోతున్నామని వృద్ధులు వాపోతున్నారు. ఉదయం 11 గంటలైతే జన సంచారం నిలిచిపోయి ప్రధాన రహదారులన్ని నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండ వేడికి తాళలేక ప్రజలు ఇళ్లకే పరిమితమౌతున్నారు. వ్యాపారులు దుఖాణాలు మూసివేస్తున్నారు. శీతలపానీయాలు, తోపుడు బండ్ల వ్యాపారులు ఎండవేడికి తిరగలేక మధ్యాహ్న సమయాల్లో చెట్ల కింద వీధి అరుగుల పైన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఓపిక తెచ్చుకుని వ్యాపారం చేద్దామన్నా వీధుల్లో ఎవరూ కనిపించడం లేదని దీంతో ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ తమకు ఆశించిన అమ్మకాలు ఉండటం లేదని ఐస్‌ఫ్రూట్ బండి వ్యాపారి కంచి రామ్మోహన్ అంటున్నారు. మధ్యాహ్న సమయాల్లో ఎండవేడికి తాళలేక ఇళ్లకు వెళుతుంటే ఆ సమయంలో కరెంటు లేక ఉక్కబోతతో సతమతమవుతున్నామని పలువురు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇంటిలో ఉండలేక, బయటకు రాలేక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న కారణంగా రాత్రి సమయాల్లోనూ ఉక్కబోత ఎక్కువగానే ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. సాయంత్రం అవ్వగానే కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ సెంటర్లు జనాలతో కిటకిటలాడుతున్నాయి. శీతల పానీయాలతో ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు.